అక్రమ నిర్మాణాలకు అడ్డేది?

- వ్యవసాయ భూముల్లోనూ నిర్మాణాలు
- జీ ప్లస్ టు పర్మిషన్‌తో అదనపు నిర్మాణాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని అధికారులు



వ్యవసాయ భూమిలో వెలిసిన భారీ షెడ్డు

కుత్బుల్లాపూర్: జీ ప్లస్ టు పర్మిషన్ తీసుకుని ఏకంగా 5 అంతస్తులు నిర్మిస్తున్నా ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం విశేషం. దూలపల్లి గ్రామంలో 143 సర్వే నంబర్లలో సుమారు 18 ఎకరాల 12 గుంటలు వ్యవసాయ భూమిగా రికార్డుల్లో చూపిస్తుంది. ఇక్కడ ఓ వ్యక్తి నాలుగు రోజుల వ్యవధిలో భారీ షెడ్డు నిర్మాణంతో పాటు ఎకరం 10 గుంటల స్థలం చుట్టూ ప్రీ కాస్ట్‌తో ప్రహరీ నిర్మించాడు. ఇదే విషయంపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరణ కోరగా.. తమకు ఆ విషయం తెలియదని చెప్పడం విశేషం.

> వ్యవసాయ భూమిలో భారీ అక్రమ షెడ్లు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే గల్లి గల్లిలో అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది.

నాలా కన్వెన్షన్ లేకుండానే..

దూలపల్లి గ్రామంలో చేపడుతున్న ఓ అక్రమ నిర్మాణం వ్యవసాయ భూమిలో జరుగుతుంది. సదరు భూమికి రైతుభరోసా కూడా పడుతుండడం విశేషం. నాలా కన్వెన్షన్ పూర్తి చేసిన తర్వాత లే అవుట్ రూపొందించి పర్మిషన్ తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలి. కానీ ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలు మాత్రం వ్యవసాయ భూమిలోనే భారీ షెడ్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఎకరం 10 గుంటల స్థలం కన్వెన్షన్ చేస్తే సుమారు రూ. 15 లక్షల వరకు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్వే నంబర్లు మొత్తం 18 ఎకరాలకు పైగా స్థలం ఉండగా అన్ని గుంటల్లోనే ఉన్నాయి. వీటికి ఎటువంటి నాలా కన్వెన్షన్ లేదు. అయినప్పటికీ ఇక్కడ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

వారానికి రెండు రోజులు మాత్రమే విజిట్

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి మాత్రం వారానికి రెండు రోజులు మాత్రమే సమయాన్ని కేటాయిస్తూ వస్తున్నారు. ఇదే విషయంపై రెగ్యులర్ టౌన్ ప్లానింగ్ అధికారి కావాలని ఇటీవల మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఉన్నత అధికారులకు లేఖ కూడా రాశారు. ఎటువంటి రెస్పాన్స్ లేకపోవడంతో డిప్యూటేషన్‌పై వచ్చి పోతున్న అధికారి పైనే ఆధారపడాల్సి వస్తుంది. ఫిర్యాదులు చేస్తున్న వాటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన అక్రమ నిర్మాణాలు పూర్తిస్థాయిలో తుది దశకు చేరుకోవడం విశేషం. నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి కిందిస్థాయి సిబ్బందితో బేరాసారాలు చేస్తున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు.



శ్రీనివాస్‌నగర్ ప్రధాన రోడ్డుపై అక్రమ నిర్మాణం

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తాం



దూలపల్లి గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన భారీ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చాం. మేడ్చల్ జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ కూడా పంపుతున్నాము. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోం. వారిపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణారెడ్డి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని ఓక్షిత్ హిల్స్ వ్యూ కాలనీని సందర్శించారు. కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజాప్రతినిధికి ప్రజల సమస్యలు పట్టడం లేదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధులతో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, పల్లి నరేష్‌రెడ్డి, కృష్ణగౌడ్, సురేందర్, రామానాయుడు, శ్రీధర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

జగద్గిరిగుట్ట: మద్యం మత్తులో మెట్లపై నుంచి జారి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీన అంజయ్యనగర్ రోడ్డు నంబరు 5లోని ఓ ఇంటి మొదటి అంతస్తు నుంచి దిగుతున్న గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో జారి పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతని వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2 ఎకరాల కేటాయింపు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని సర్వే నంబర్ 342లో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2 ఎకరాలు కేటాయించినట్లు మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాష్ తెలిపారు. 2007లో మేడ్చల్ నుంచి కుత్బుల్లాపూర్‌కు ప్రత్యేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుంచి సూరారంలో అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతుంది. దీంతో భవనం ఇరుకుగా ఉండడం, వాహనాలు పార్కింగ్ చేయడానికి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ క్రమంలో సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణ కార్యాలయానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భద్రత

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది ముఖ్యమంత్రి సహాయనిధి అని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌కు చెందిన కలవల మరియమ్మ, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీధర్‌కు లక్ష రూపాయల చొప్పున ఎల్‌వోసీ మంజూరైంది. ఆ ఎల్‌వోసీని శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగరాయ ప్రసాద్, సలీం, సుధాకర్, యూత్ నాయకులు ఎర్వ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ సమయాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయినగర్, ఆదిత్యగార్డెన్స్, రాజీవ్ గృహకల్ప, మా విల్లాస్, కౌసల్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. సాయి అనురాగ్ కాలనీ, రేణుకా ఎల్లమ్మ కాలనీ, రెయిన్‌బో కాలనీ, హరిత కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

చింతల్: సమ్మర్ యాక్షన్‌లో భాగంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్ఏఎల్ సబ్ స్టేషన్ సౌభాగ్యనగర్ ఫీడర్ పరిధిలో ఆదర్శనగర్, సౌభాగ్య నగర్, ఇందిరాగాంధీ నగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, ఏపీహెచ్‌బీ మెయిన్ రోడ్డు, గిరినగర్, బీజేఆర్ నగర్, రంగారెడ్డినగర్, పంచశీల కాలనీ, ప్రాగా టూల్స్ సబ్ స్టేషన్ గిరినగర్ ఫీడర్ పరిధిలోని రంగారెడ్డినగర్, సన్ టెక్ ఇంజనీరింగ్, పంచశీల కాలనీ, నంద ఫుడ్స్ మెయిన్ రోడ్డు, బీవీ ఇంజనీరింగ్ వర్క్స్, రెయిన్‌బో స్కూల్, సాయి లక్ష్మీ ఇండస్ట్రీస్, ఎస్కే ఇంజనీరింగ్, ఎస్‌కేఎమ్ టెక్నాలజీ, గాంధీనగర్, సీబీఈ గాంధీనగర్ పరిధిలోని కొన్ని గల్లీలలో మధ్యాహ్న 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని ఏడీఈ కోరారు.

కుత్బుల్లాపూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలోని జీడిమెట్ల గ్రామం, భీమా ప్రైడ్, మిడోస్ హాస్పిటల్ ప్రాంతాలు, ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలోని గాయత్రినగర్, గోదావరి హోమ్స్, 11కేవీ పైపులైన్ ఫీడర్ పరిధిలోని జీడిమెట్ల గ్రామం, ఎస్సీ కాలనీ, అరేమ్స్‌బర్గ్ అపార్ట్‌మెంట్, 11కేవీ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని దండమూడి ఎన్‌క్లేవ్, సురక్ష ఆసుపత్రి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, శాంతశ్రీరామ్ అపార్ట్‌మెంట్స్, 11కేవీ బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో బ్యాంక్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, వేంకటేశ్వరకాలనీ, ఎం.ఎన్. రెడ్డినగర్, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో రామరాజునగర్, మై ఫ్రెండ్స్ సర్కిల్, లయోలా కళాశాల రోడ్డు, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 11కేవీ బాలాజీ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని హైటెక్షన్‌రోడ్డు ఏరియా, సెరెనీ అవెన్యూ గేట్ 1, 2, 3, అంగడిపేట్ గ్రామం, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4 గంటల వరకు 11కేవీ సన్మాన్ బెల్మార్ ఫీడర్ పరిధిలోని ఉడ్స్ కాలనీ, వైష్ణవి మిడోస్, సన్మాన్ విల్లాస్, యాదిరెడ్డిబండ, సయ్యద్‌నగర్, ఉదయం 10 నుంచి 10.30 వరకు 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలోని జయరామ్‌నగర్, రుక్మిణి ఎస్టేట్స్, శ్రీకృష్ణనగర్, గణేష్ కాలనీ, జేకే నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఎర్లీ బర్డ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. ఆస్తి పన్నుల వసూళ్లలో భాగంగా కల్పించిన 5 శాతం రాయితీని ఉపయోగించుకోవాలని సూచించారు. బహదూర్‌పల్లిలోని టెక్ మహీంద్ర యూనివర్సిటీ సంస్థ ప్రతినిధులు శుక్రవారం రూ.1.04 కోట్ల పన్ను చెల్లించారు. ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు ఉంటుందని, గృహ యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు సన్మానం



కౌన్సిలర్లను సత్కరిస్తున్న ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు జ్యోత్స్నారెడ్డి, బైరి శ్రీవిద్య, బైరి సరితగౌడ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలనను కొనసాగిస్తోందని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. రాజీవ్ గృహకల్పలోని సమస్యల పై శుక్రవారం ఆయన పర్యటించారు. కాలనీలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నీటి సమస్యపై స్థానికులు వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ, నీటి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గార్లపాటి ప్రభాకర్, మాజీ ప్రధాన కార్యదర్శి వనం శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి ధర్మారపు అంజయ్య, మాజీ ఉపాధ్యక్షులు వంగాల పరశురాం, కాలనీ సీనియర్ నాయకులు పి లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షులు జంగేటి తిరుపతి, మహిళా సమైక్య అధ్యక్షురాలు మాధవి, పద్మ, మురళి, సత్యనారాయణ, పుష్ప, గోపాల్, మమత, నిర్మల, సరస్వతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మేలు జరిగేలా కృషి



మాట్లాడుతున్న చింతల నాగరాజు

జీడిమెట్ల: సాయినార్ పరిశ్రమ కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని కార్మిక నాయకులు, యూనియన్ అధ్యక్షుడు చింతల నాగరాజు అన్నారు. శుక్రవారం జీడిమెట్లలోని నాయినార్ పరిశ్రమలో కార్మిక విభాగం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూ.20 వేల వేతన ఒప్పందం చేయాలని ఆయనను కార్మికులు కోరారు. కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



కుత్బుల్లాపూర్: వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్, క్లేటన్ ప్లే స్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండవ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. పిల్లల ప్రవర్తన విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పీపీ–2 పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్ అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు .

మూడుగుళ్లల్లో మహా పడిపూజ

కుత్బుల్లాపూర్: అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా కుత్బుల్లాపూర్ గ్రామంలోని మూడుగుళ్ల దేవస్థానం వద్ద శ్రీధర్మశాస్త్ర అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కెఎం ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీధర్మశాస్త్ర అన్న ప్రసాద సేవా సమితి అధ్యక్షుడు కవాడి గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు టి. కృష్ణ, కవాడి చంద్రారెడ్డి, కవాడి జైపాల్ రెడ్డి, అత్తాపురం నరసింహారెడ్డి, సామల సత్తిరెడ్డి, సుధాకర్ రెడ్డి, నాగరాజు, సప్పిడి కృష్ణారెడ్డి, నవీన్ కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.



వైభవంగా తిరు కల్యాణ మహోత్సవం

పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట : చింతల్, పద్మానగర్ ఫేజ్ 1, శ్రీదేవి భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. 6 రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం తిరు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శనివారం కుంకుమార్చన, నిత్య హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపూ, జైభీమ్, జైసంవిధాన్

8వ రోజుకు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 1వ డివిజన్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపూ, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం 8వ రోజుకు చేరింది. కార్పొరేషన్ పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చిట్ల దివాకర్, కొలను వీరేందర్‌రెడ్డి, ఇంద్రజీత్, ఆవుల జగదీష్, నాయకులు కొలను జీవన్‌రెడ్డి, కొలను సత్తిరెడ్డి , మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నందనవనం పార్కును అభివృద్ధి చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: ప్రగతినగర్ 4వ డివిజన్‌లోని డాక్టర్స్ కాలనీ నందనవనం పార్కును అభివృద్ధి చేయాలని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్, మాజీ కార్పొరేటర్ శ్రీరాములు కోరారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్కులో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్కులోని చెట్లకు ప్రతి రోజు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పార్కులో ఉన్న ఇంకుడు గుంతను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో స్వాతిరావు, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్, బేతపూడి శ్రీనివాస్, చందా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో అంతర్జాతీయ సదస్సు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం 'ఫార్మసీ 4.0: ఆవిష్కరణ. సాంకేతికత ద్వారా ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు' అనే థీమ్‌తో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులతో పాటు వివిధ కళాశాలలకు చెందిన 700 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన బిట్స్ పిలాని ప్రొఫెసర్ డా. స్వాతి బిస్వాస్ ఆవిష్కరణల్లో అంతర్జాతీయ సహకార ప్రాముఖ్యతపై ప్రసంగించారు. డైరెక్టర్ ధీరేన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరునభ మల్లిక్ తదితరులు విలువైన సూచనలు, సలహాలు చేశారు. మోనాష్ యూనివర్సిటీకి చెందిన అంతర్జాతీయ అతిథి డాక్టర్ మహేందర్ శేఖర్ ప్రత్యేక ఉత్సాహాన్ని నింపారు. సాంకేతిక సెషన్లు, ప్రెజెంటేషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో మొదటి రోజు సదస్సు విజయవంతంగా ముగిసింది.



సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

జయంతి సందర్భంగా ఘన నివాళి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే అని వక్తలు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం వివిధ డివిజన్‌లలో విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. సమాజంలో నెలకొన్న సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు జ్యోతిరావ్‌పూలే కృషి చేశారని, స్త్రీల హక్కుల కోసం పాటుపడ్డారని వక్తలు కొనియాడారు.

– కుత్బుల్లాపూర్



జీడిమెట్ల బస్ డిపో వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు



బాచుపల్లిలో నివాళులర్పిస్తున్న వీరేష్ తదితరులు



బీజేపీ ఓబీసీ యువమోర్చా ఆధ్వర్యంలో ..



సూరారంలో దళిత మోర్చా నాయకుల ఆధ్వర్యంలో..



గండిమైసమ్మలోని శ్లోకా పాఠశాలలో..



జగద్గిరిగుట్టలో నివాళులర్పిస్తున్న ఐలయ్యగౌడ్



షిర్డీహిల్స్ బుద్ధ విహార్ వద్ద..